సాక్షి ఖమ్మం

సోమవారం। 19। మే। 2025



సేంద్రియ సాగుపై దృష్టి

భూసార లోపాన్ని అధిగమించేందుకు రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారిస్తుండగా పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయని అంటున్నారు. 8లో



గిరిజన గురుకులాల్లో సీట్లు భర్తీ

ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం సీట్లను భర్తీ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలోని పలువురు తహసీల్దార్లకు ఇటీవల బదిలీలు జరగగా.. వారి స్థానంలో జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ఆయా స్థానాల్లో వెంటనే బాధ్యతలు స్వీకరించనున్నారు. మహబూబాబాద్ జిల్లా నుంచి వచ్చిన డి.సైదులును ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ వి.రవికుమార్‌ను కూసుమంచి మండలానికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వచ్చిన ఎం.రమాదేవిని బోనకల్ తహసీల్దార్‌గా, మహబూబాబాద్ జిల్లా నుంచి వచ్చిన ఎస్.శ్వేతను రఘునాథపాలెం మండలానికి, అక్కడి తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను తిరుమలాయపాలెం మండలానికి బదిలీ చేశారు. ఎస్.వి.నారాయణమూర్తిని కల్లూరు ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా నియమించారు.

హెచ్ఐవీ రహిత జిల్లాగా మార్చాలి

డీఎంహెచ్ఓ కళావతిబాయి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

ఖమ్మంవైద్యవిభాగం : జిల్లాను హెచ్ఐవీ రహితంగా మార్చాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి అన్నారు. అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన కళావతిబాయి మాట్లాడుతూ.. హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల ప్రేమ, అనురాగాలు చూపించాలని, వారిని కూడా సమాజంలో అందరిలాగే గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ డాక్టర్లు లక్ష్మణరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్

ఖమ్మం సహకారనగర్ : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో మొత్తం ఏడు ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఖమ్మం, ఖమ్మం పరిసర ప్రాంతాల్లో ఆరు కేంద్రాలు ఉండగా.. సత్తుపల్లిలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత 2 : 30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు కొనసాగగా.. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిన్నెరసానిలో జలవిహారం



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు కిన్నెరసాని ప్రాజెక్ట్‌కు తరలివచ్చారు. డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 560 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.30,820 ఆదాయం లభించింది. 250 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.13,300 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఫార్మర్ ఐడీలో ఫస్ట్..

జూన్ 5 వరకు అవకాశం..

ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్లకు జూన్ 5 వరకు అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పథకాలను పొందుతున్న రైతులు, అర్హత ఉండీ పథకాలు అందుకోలేకపోతున్న వారు ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఫార్మర్ ఐడీ పొందే అవకాశం ఉంది. ప్రతి క్లస్టర్‌లోని రైతు వేదికలో ఏఈఓలు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఫార్మర్ ఐడీలో అర్హత సాధించిన రైతులకు 11 అంకెలతో కూడిన ఐడీ నంబర్ జనరేట్ అవుతుంది. దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు అందుతాయి. పీఎం కిసాన్ యోజన, పంటలకు నష్టం వాటిల్లితే ప్రధాన మంత్రి ఫసల్ బీమా వంటి పథకాలతో పాటు కేంద్రం అందించే ఎరువులు, విత్తనాలు వంటివి కూడా పొందే అవకాశం ఉంటుంది.

రైతు గుర్తింపు నమోదులో జిల్లా ముందంజ

- పది రోజుల్లో 45 వేల మంది రిజిస్ట్రేషన్
- 35 వేల మందికి గుర్తింపు కార్డులు సిద్ధం
- జూన్ 5 వరకు పూర్తి స్థాయిలో అర్హుల రిజిస్ట్రేషన్, ఐడీ కార్డుల జారీ

ఖమ్మంవ్యవసాయం : ఫార్మర్ ఐడీ(రైతు గుర్తింపు) రిజిస్ట్రేషన్ల నమోదు ప్రక్రియలో జిలా అగ్రగామిగా నిలిచింది. వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ చేయడమే లక్ష్యంగా రూపొందించిన ఫార్మర్ ఐడీ ప్రాజెక్ట్ ఈనెల 5న ప్రారంభం కాగా, ఇప్పటి వరకు నమోదులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగం ఉన్న 32 జిల్లాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పథకం నిబంధనల ఆధారంగా జిల్లాలో 3,40,072 మంది రైతులు అర్హులు ఉన్నారు. వీరిలో మే 17 నాటికి 45,450 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే 35,017 మంది రైతులకు ఫార్మర్ ఐడీ జనరేట్ అయింది. ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో రెండో స్థానంలో రాజన్న సిరిసిల్ల, మూడో స్థానంలో కరీంగనర్, నాలుగో స్థానంలో కామారెడ్డి, ఐదో స్థానంలో నిజామాబాద్ జిల్లాలు నిలవగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 17వ స్థానానికి పరిమితమైంది. చివరి స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉంది.

అవగాహనతోనే వేగవంతం..

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫార్మర్ ఐడీపై రైతులకు అవగాహన కల్పించడంతో ఈ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. కేంద్రం రూపొందించిన పథకాల అమలుకు ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, సాయిల్ హెల్త్ కార్డు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, భారత ఆహార భద్రత మిషన్, రాష్ట్రీయ కృషి వికాస యోజన వంటి పథకాల అమలులో ఈ ఐడీ కార్డు కీలకం కానుంది. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను పారదర్శకంగా రైతుల దరి చేర్చడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో వానాకాలం పంట సాగు అంశాలను వివరించడంతో పాటు ఫార్మర్ ఐడీతో ప్రయోజనాలు, రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యతను కూడా వివరిస్తుండగా ప్రక్రియ వేగవంతానికి ఇవి దోహదం చేస్తున్నాయి.

భూమి, పంటల సాగు వివరాలు నమోదు..

ఫార్మర్ ఐడీ ప్రక్రియలో రైతులకు ఉన్న భూమి వివరాలు సర్వే నంబర్ల వారీగా నమోదవుతాయి. భూమి రకం, ఆయా భూముల్లో సాగు చేసే పంటలను కూడా పొందుపరుస్తారు. డిజిటల్ విధానంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 129 క్లస్టర్లలో ఈ ప్రక్రియ నిరంతరాయంగా సాగుతోంది. రైతు వేదికల్లో నిర్వహించే ఈ ప్రక్రియకు రైతులు తరలివస్తూ ఫార్మర్ ఐడీ కోసం తమ భూములు, పటల సాగు వివరాలు చెబుతూ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అందుబాటులో లేని కొందరు రైతులు మీ సేవా కేంద్రాల్లోనూ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

ఫార్మర్ ఐడీకి ఎంతో ప్రాధాన్యం



ఫార్మర్ ఐడీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ కార్డు ఆధారంగానే కేంద్ర పథకాలు అందుతాయి. కార్డు లేనివారు ఆ పథకాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. రైతులు తప్పనిసరిగా నిర్దేశిత గడువు లోగా ఏఈఓలను సంప్రదించి భూములు, పంటల సాగు వివరాలను తెలిపి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

ముందస్తు 'కోటా'

- ఒకేసారి మూడు నెలల బియ్యం సరఫరా
- పంపిణీకి అధికార యంత్రాంగం సన్నద్ధం
- ఇప్పటికే డీలర్లతో సమావేశం



ఖమ్మం సహకారనగర్: పేదలకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా.. జూన్‌లో మాత్రం ఒకేసారి మూడు నెలల కోటా అందించనున్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలల బియ్యం ముందుగానే లబ్ధిదారులకు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు సైతం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరు వరకు ప్రతి నెల మాదిరిగానే బియ్యం సరఫరా చేసి.. ప్రజలకు పంపిణీ ప్రారంభించే సమయానికి మిగతా రెండు నెలల బియ్యం నిల్వలు కూడా ఆయా రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

నెలకు 6,500 మెట్రిక్ టన్నులు..

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ దుకాణాలుండగా.. వీటి పరిధిలో 4,10,988 కార్డులు ఉన్నాయి. 11,48,031 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తుండగా 73,75,868 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతున్నాయి. సరాసరిన 90 శాతం వరకు లబ్ధిదారులు తీసుకెళ్తున్న క్రమంలో సుమారు 6,500 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు అవసరం అవుతుండగా.. మూడు నెలలకు సంబంధించి సుమారు 20వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం.

పంపిణీపై సమాలోచనలు..

ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ చేయాల్సిన క్రమంలో అధికారులు, డీలర్లు సమాలోచనలు చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో నెలకు సరిపోయే అన్ని సరుకులు మాత్రమే నిల్వ చేసే అవకాశం ఉన్న క్రమంలో మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఎలా పంపిణీ చేయాలి.. ఎక్కడ నిల్వ ఉంచాలి.. పంపిణీ ఏ విధంగా చేస్తే బాగుంటుంది అనే అంశాలపై అధికారులు ఆలోచిస్తున్నారు. గత మూడు రోజుల క్రితం రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలోనూ మూడు నెలల బియ్యం పంపిణీపై అధికారులు పలు సూచనలు చేశారు.

సన్నద్ధమవుతున్నాం



ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన సమయంలో మూడు నెలలకు సంబంధించిన బియ్యం రేషన్ లబ్ధిదారులకు ఇవ్వాలనే అంశంపై పలు సూచనలు చేశారు. వారి సూచనల ప్రకారం జిల్లాలో మూడు నెలలకు సంబంధించిన బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వచ్చిన వెంటనే వాటిని అమలు చేయనున్నాం. – చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

వర్షాలు, వరదల భయంతో..

గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించిన నేపథ్యంలో ఈ ఏడాది ముందస్తుగా లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. ఇదే అంశంపై డీలర్లతో నిర్వహించిన సమావేశంలోనూ అధికారులు చూచాయగా విషయాన్ని వివరించారు. బియ్యం నిల్వ చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని డీలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. సరఫరా అంతా ఏకకాలంలో జరగదని, బియ్యం లబ్ధిదారులకు పంపిణీ త్వరితగతిన చేస్తున్న క్రమంలో ఆ నిల్వలు తగ్గిన సమయంలో మరికొంత నిల్వలు అందజేస్తామని వెల్లడించారు.

మద్యం ధరలకు రెక్కలు

- క్వార్టర్‌పై రూ. 10, ఫుల్ బాటిల్‌కు రూ.40 పెంపు
- నేటి నుంచి అమలుకు రంగం సిద్ధం



వైరా: మద్యం ధరలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే గత నవంబర్‌లో బీరు ధరలు పెంచిన సర్కార్.. ఆరు నెలలకే లిక్కర్ ధరలు కూడా పెంచడంతో మద్యం ప్రియుల జేబులకు చిల్లు పెట్టినట్టయింది. పెరిగిన ధరలు సోమవారం నుంచే అమల్లోకి వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. చీప్ లిక్కర్ నుంచి అన్ని రకాల మద్యం ధరలను ప్రభుత్వం పెంచింది. క్వార్టర్ (180 ఎంఎల్) సీసాపై రూ.10 పెంచగా, హాఫ్ బాటిల్‌కు రూ. 20, ఫుల్ బాటిల్‌పై రూ.40 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ప్రధాన ఆదాయ వనరుల్లో మద్యం కూడా ఒకటి. గతంలో బీర్ల ధర రూ. 20 నుంచి రూ. 40 వరకు పెంచడంతో ఈ ఏడాది గతంలో ఏన్నాడూ లేనంతగా బీర్ల అమ్మకాలు సగానికి పైగా తగ్గాయి. మళ్లీ అన్ని బ్రాండ్ల లిక్కర్ రేట్లు పెంచడంతో అమ్మకాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

నేడు మద్యం డిపోలో బిల్లింగ్ ఆలస్యం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మద్యం సరఫరా అయ్యే వైరాలోని మద్యం డిపోలో వ్యాపారులు బిల్లింగ్ కోసం వస్తుంటారు. పెరిగిన ధరల జాబితా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అయ్యేందుకు కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని, మధ్యాహ్నం తర్వాత సర్వర్‌లో మార్పులు చేసి పూర్తి స్థాయిలో ధరల జాబితాను వ్యాపారులకు అందించే అవకాశం ఉంటుందని డిపో అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటికే సోషల్ మీడియాలో పెంచిన ధరల జాబితా చక్కర్లు కొడుతోంది. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ నిర్ణయంతో మద్యం ప్రియులపై ధరల పిడుగు పడిందని చెప్పొచ్చు.

మద్యం ప్రియుల 'బారు'లు

ఖమ్మంక్రైం : పెరిగిన మద్యం ధరలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలోని పలు వైన్స్, బార్ షాపుల ఎదుట మద్యం ప్రియులు బారులుదీరారు. క్వార్టర్‌కు రూ.10, హాఫ్ రూ.20, ఫుల్ బాటిల్‌కు రూ.40 చొప్పున పెరుదుతుండడంతో పలువురు మద్యం కొనుగోలు చేసి నిల్వ పెట్టుకున్నారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత

ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి



కారేపల్లి: బాల్యవివాహాలు నివారించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని సీడీపీఓ దయామణి అన్నారు. ఆదివారం కారేపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బాల్యవివాహాలు సమాజానికి ప్రతిబంధకాలని, ఎన్నో అనర్థాలకు దారితీస్తాయని తెలిపారు. 18 ఏళ్ల నిండని బాలికల్లో శరీర, మానసిక పెరుగుదల, లైంగిక పరిపక్వత సరిగా ఉండదని అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గ్రామ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తహసీల్దార్, సీడీపీఓ, ఆర్‌డీఓ, కలెక్టర్‌లకు బాల్య వివాహాలు నిరోధించే అధికారం ఉందని వివరించారు. బాల్య వివాహం జరుగుతోందని తెలిస్తే 1098కి సమాచారం ఇస్తే హెల్ప్‌లైన్ సిబ్బంది, కార్యదర్శి, పోలీస్, ఐసీడీఎస్ అధికారులు ఆ ఇంటిని సందర్శించి విచారణ చేపడతారని చెప్పారు.

పాలేరుకు మున్నేరు నీరు

- లింక్ కెనాల్ నిర్మాణానికి రూ.162.54 కోట్లు మంజూరు
- గ్రావిటీ ద్వారా వరదనీరు మళ్లించేలా డిజైన్..
- సీఎంకు మంత్రి పొంగులేటి కృతజ్ఞతలు

ఖమ్మంఅర్బన్ : సముద్రంలోకి వృథాగా వెళ్లిపోతున్న మున్నేరు వాగు వరద నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి రూ.162.54 కోట్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గ్రావిటీ ద్వారా మళ్లించే విధానంతో రూపాయి ఖర్చు లేకుండా 10 టీఎంసీల వరదనీటిని పాలేరు రిజర్వాయర్‌కు తరలించవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు దోహదపడుతుందని వివరించారు. ఈ మేరకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రక్షాళన అవుతుందని చెప్పారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గంలోని పది చెరువులకు సాగునీరు అందుతుందని తెలిపారు. మున్నేరు నుంచి పాలేరు లింక్ కెనాల్ వరకు భూమి తవ్వకం, కట్ట నిర్మాణంతో పాటు కల్వర్టులు, వంతెనలు, వాగులపై యూటీలు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద వంతెనల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

కాగా, మంత్రి పొంగులేటి సూచనలతో జలవనరుల శాఖ డీఈ రమేష్‌రెడ్డి, పలువురు ఇంజనీర్లు దీనికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదించగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రైతులకు ప్రయోజనం కలగనుంది.

ఆకట్టుకున్న 'తితిక్ష'



తితిక్ష నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: గంజాయి మత్తులో తూగుతూ రాక్షసుడిగా వ్యవహరిస్తున్న కొడుకును తల్లి హత్య చేసిన ఇతివృత్తంగా రూపొందించిన 'తితిక్ష' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో కాకినాడకు చెందిన బీవీకే క్రియేషన్స్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. ముందుగా హైదరాబాద్ దాశరథి థియేటర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం సహకారంతో నాన్న ఉత్తరం, నా ఆడపిల్ల లఘు చిత్రాలను ప్రదర్శించారు. ముళ్లపూడి ఈశ్వరి కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నెలనెలా వెన్నెల నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన సభలో నాటిక ప్రదర్శకులకు పారితోషికం అందించారు. ఈ సందర్భంగా దాతలు న్యాయవాది జాబిశెట్టి పాపారావు, కొండపల్లి జగన్మోహన్ రావు, వంగవీటి నవీన్ మాట్లాడుతూ.. రంగస్థల కళాకారులను ప్రోత్సహిస్తూ నెల నెలా వెన్నెల కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో ఇలాంటి నాటికలు ప్రదర్శించటం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో నెల నెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యాకుమార్, మోటమర్రి జగన్మోహన్ రావు, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ, మార్తి కొండల్‌రావు, నందిగామ కృష్ణ, శానం వీరబాబు, జి.రవీందర్ పాల్గొన్నారు.



పారితోషికం అందిస్తున్న నిర్వాహకులు

నిరీక్షణకు ఇక తెర..

- నేర పరిశోధనలో కీలకంగా ఫోరెన్సిక్..
- వేగవంతమవుతున్న పోస్ట్‌మార్టం
- 15 నెలల్లో 1,218 శవ పరీక్షలు
- అందులో 20 శాతం అనాథ శవాలే



జిల్లా ఆస్పత్రిలోని మార్చురీ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొంతకాలంగా శవ పరీక్షలు వేగంగా జరుగుతున్నాయి. ఫోరెన్సిక్ విభాగం అందుబాటులోకి వచ్చాక పోస్టుమార్టం నిర్వహణ, రిపోర్టులు వేగవంతంగా రావడం పోలీసుల నేరపరిశోధనకు ఉపయుక్తంగా మారాయి. సంబంధిత వ్యక్తి ఎలా, ఎప్పుడు మరణించాడనేది తేల్చేందుకు పోస్ట్‌మార్టం నిర్వహిస్తారు. పోలీసులు పంచనామా నిర్వహించి ఫోరెన్సిక్ వైద్యునికి రిక్వెస్ట్ లెటర్ పెట్టిన తర్వాత శవ పరీక్ష చేస్తారు. ఆ తర్వాత వైద్యుడు ఇచ్చే రిపోర్ట్‌ను బట్టి పోలీసులు విచారణ చేపడతారు. గతంలో శవ పరీక్షకు చాలా ఇబ్బందులు ఉండేవి. పోలీసులు పంచనామా సిద్ధం చేసి మార్చురీకి వచ్చినా పోస్టుమార్టానికి వైద్యుడు రావడం ఆలస్యమయ్యేది. దీంతో పోలీసులు, మృతుల బంధువులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది.

అంతేకాక క్రిటికల్ కేసుల్లో మృతికి కారణాలను గుర్తిస్తూ రూపొందించే రిపోర్టులు ఆలస్యంగా వచ్చేవి. కొన్ని వరంగల్, మరికొన్ని హైదరాబాద్ పంపించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. కీలకమైన శవ పరీక్షలే హైదరాబాద్‌లో చేయిస్తున్నారు తప్ప మిగితావి ఖమ్మంలోనే నిర్వహిస్తున్నారు.

ఘోషిస్తున్న అనాథ శవాల ఆత్మలు

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీలో గత 15 నెలల్లో 1,218 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. 2024లో 995, ఈ మూడు నెలల కాలంలో 223 శవపరీక్షలు జరిగాయి. జిల్లాలో హత్యలు, ఆత్మహత్యలు, రైలు, రోడ్డు ప్రమాదాలు, అనుమానిత మరణాలకు సంబంధించిన బాడీలకు ఇక్కడే పోస్టుమార్టం నిర్వహిస్తారు. అలా వచ్చే మృతదేహాల్లో 20 శాతానికి పైగా అనాథ శవాలే ఉంటున్నాయి. ఎక్కడో పుట్టి, ఎక్కడి నుంచో వచ్చి జిల్లాలో మృతి చెందే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా యాచకులు, పనుల కోసం వచ్చేవారు, రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందేవారు, ట్రైన్ నుంచి పడి మృతి చెందే వారు ఎక్కువగా ఉంటున్నారు. వారిని గుర్తు పట్టడం కష్టం అవుతుండగా కొద్ది రోజులు వేచి చూసి పోలీసులు, ఆస్పత్రి అధికారుల నిర్ణయంతో అనాథ శవాలుగా దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఈ శవాల దహనానికి జిల్లాలో ప్రభుత్వ పరంగా ఎలాంటి వ్యవస్థ లేదు. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఈ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

సకాలంలో నివేదికలు అందజేస్తున్నాం



శవ పరీక్షలు ఏరోజుకారోజు నిర్వహిస్తున్నాం. రాత్రి పూట కూడా పోస్టుమార్టం చేస్తున్నాం. పోలీసు కేసుల విచారణకు అవసరమైన రిపోర్టులు సకాలంలో అందజేస్తున్నాం. మార్చురీ వద్దే కార్యాలయం ఏర్పాటు చేసి నిత్యం అందుబాటులో ఉంటున్నాం. సాధ్యమైనంత వరకు ఇక్కడే శవ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అత్యవసరమైన వాటికి హైదరాబాద్‌కు శాంపిళ్లు పంపిస్తున్నాము. భవిష్యత్‌లో అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తాం.

– రాథోడ్ వినాయక్, ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్

శవ పరీక్ష కీలకం..

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లిన తర్వాత ఫోరెన్సిక్ విభాగం అందుబాటులోకి వచ్చింది. ఎంబీబీఎస్ విద్యార్థులకు దీనిపై సబ్జెక్ట్ ఉంటుంది. ఫోరెన్సిక్ విభాగంలో ప్రత్యేకంగా ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్లను నియమించారు. దీంతో పోస్టుమార్టం నిర్వహణలో ఇబ్బందులు తొలగిపోయాయి. బాధిత కుటంబాలకు సకాలంలో సేవలు అందుతుండగా, పోలీసులకు సైతం రిపోర్టులు సమయానికి వస్తున్నాయి. కాగా నేరపరిశోధనలో పోస్టుమార్టం రిపోర్టు కీలకం. మృతికి దారితీసిన ఘటనలను నిర్ధారించాల్సిన అవసరం ఉంటుంది. సాధారణంగా హత్య, ఆత్మహత్య, హత్యాచారం, ప్రమాదం, అనుమానాస్పద మరణాలు సంభవించినప్పుడు క్రిమినల్ కేసుల పరిష్కారానికి శవ పరీక్షలు కీలకంగా నిలుస్తాయి. గతంలో పోస్ట్‌మార్టం ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగగా ఫోరెన్సిక్ వైద్యుడి రాకతో ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. మార్చురీ వద్ద ఫోరెన్సిక్ విభాగం ఏర్పాటుతో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటుండగా నిరీక్షణకు తెరపడింది.

క్లుప్తంగా

నిబద్ధత గల కమ్యూనిస్టు ప్రసాద్


స్తూపం ఆవిష్కరిస్తున్న హేమంతరావు, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నీడలో పోరాటం సాగించిన పోటు ప్రసాద్ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఆదివారం బోనకల్ రోడ్డులోని ఆదిత్య థియేటర్ సమీపంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, దివంగత కార్మిక నేత పోటు ప్రసాద్ స్మారక స్తూపాన్ని హేమంతరావు ఆవిష్కరించారు. అంతకు ముందు స్థానిక జెడ్పీ సెంటర్ నుంచి స్తూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. హేమంతరావు మాట్లాడుతూ పోటు ప్రసాద్ విద్యార్థి దశ నుంచి లౌకిక, వామపక్ష భావజాలంతో పని చేశారన్నారు. ప్రసాద్ తన చివరి కార్యక్రమాన్ని 40వ డివిజన్లో నిర్వహించారని, ఇక్కడి ప్రజలు స్తూపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కాగా, స్తూపం వద్ద సీపీఐ పతాకాన్ని రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, నాయకులు జానీమియా, పోటు కళావతి, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, పోటు రాజాసాత్విక్, పగడాల మల్లేశ్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం నమ్మొద్దు..

ఖమ్మంవ్యవసాయం: అయిల్‌పామ్ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న టీజీ ఆయిల్ ఫెడ్ (తెలంగాణ రాష్ట్ర సహకార నూనె గింజల రైతుల సమాఖ్య)పై పలు ప్రైవేట్ కంపెనీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని సంస్థ మేనేజ్‌మెంట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. రైతులను ప్రోత్సహించి, నాణ్యమైన మొక్కలు అందించి, తాజా పండ్ల గుత్తులకు మార్కెట్ లింకేజీ కల్పించి, ఆయిల్‌పాం పంటను విస్తరిస్తున్నామని పేర్కొంది. ఇందుకు వ్యతిరేకంగా కొన్ని ప్రైవేట్ కంపెనీలు అసత్య ప్రచారం చేస్తూ సంస్థ ఖ్యాతిని దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నాయని, దీనిని ఎవరూ నమ్మొద్దని సూచించింది.

అగ్ని ప్రమాద మృతులకు సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ పాత నగరంలోని చార్మినార్ గుల్జార్ హౌస్ సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం బాధాకరమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటించారు. మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అగ్ని ప్రమాదం బాధాకరమని, బాధితులను ఆదుకోవాలని కోరారు.

9 ఇసుక లారీల పట్టివేత

ఖమ్మంక్రైం: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. గంధసిరి నుంచి నగరంలోకి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రాపర్తివంతెన వద్ద, ఐదు ట్రాక్టర్లను ప్రకాష్‌నగర్ వంతెన వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలకు సంబంధించి టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిసింది.

పెళ్లికి వినూత్న ఆహ్వానం


పెళ్లి ఆహ్వాన పత్రిక ముద్రించిన సంచి

పాల్వంచ: పట్టణంలోని గోవర్ధనగిరికాలనీకి చెందిన ఏనుగు రవీందర్ రెడ్డి, జ్యోతి దంపతులు వారి కూతురు గౌతమిని సుజాతనగర్ వేపలగడ్డకు చెందిన తాళ్ల శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చి ఆదివారం వివాహం చేశారు. అయితే, ఈ పెళ్లిపత్రికను గుడ్డసంచిపై ముద్రించి అందులో కార్డు పెట్టి పంచారు. 'ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం' అందులో ప్రింట్ చేయించారు. వివాహం ఆద్యంతం ప్లాస్టిక్ వాడకుండా ఉండటంతో అందరూ అభినందించారు.

శ్రీకనకదుర్గమ్మకు విశేష పూజలు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేషపూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

సేంద్రియ సాగుపై దృష్టి

జీవాల ఎరువు దుక్కికి బలం

- ఇతర జిల్లాల నుంచి వలసవచ్చి ఎరువు చేర్చి సంపాదిస్తున్న కురములు
- జీవాల ఎరువు కోసం పోటీ పడుతున్న రైతులు
- అధిక దిగుబడులు వస్తాయంటున్న అన్నదాతలు


బోనకల్‌లోని ఓ రైతు పొలంలో జీవాల మంద

బోనకల్: పెరిగిన పెట్టుబడులు.. తగ్గుతున్న దిగుబడులు.. భూసార లోపాన్ని అధిగమించేందుకు అన్నదాతలు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారిస్తున్నారు. గతంలో పాడి పశువుల ఎరువును పొలాలకు ఎరువుగా ఉపయోగించుకునేవారు. తగ్గిన పశు సంపద వల్ల రైతులు తమ పొలాలకు ఎరువును వేయలేకపోవడంతో భూసారం తగ్గి దిగుబడులు పడిపోతున్నాయి. దీంతో రైతులు జీవాల ఎరువుపై దృష్టి సారించారు. కొందరు యాదవులకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయడంతో వాటిని పొలాల్లో ఎరువుల కోసం ఉపయోగిస్తున్నారు. దీనికి తోడు మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో కురుమ, యాదవులు మేత కోసం గొర్రెలను బోనకల్ మండలం తీసుకొచ్చారు. ఉదయం మేతమేపుతూ రాత్రి సమయాల్లో వాటిని ఎరువు కోసం ఉంచుతున్నారు. 2000 జీవాలు ఒక రోజు ఉంచితే ఎకరం పొలానికి ఎరువు సరిపోతుంది. ఇందుకు గాను రైతుకు రూ.1500 నుంచి రూ.2000 ఖర్చవుతుంది. తక్కువ ఖర్చుతో పొలం సారవంతంగా తయారవుతుందని అన్నదాతలు వాటి కోసం పోటీ పడుతున్నారు. పొలంలో గొర్రెలు, మేకల మంద వదిలితే పేడ, మూత్రం, వెంట్రుకల వల్ల భూమికి సేంద్రియ పదార్థం లభిస్తుంది. గొర్రె పేడలో పీచుపదార్థం ఎక్కువగా ఉండడం వల్ల మొక్కల వేర్లు భూమిలోపలికి సులువుగా వెళ్లి తొందరగా మొక్క ఎదుగుతుందని రైతులు చెబుతున్నారు. వాటి మూత్రం పీహెచ్ 7.7 ఉండడం వల్ల భూమిలో ఉన్న చౌడు కూడా పోయి సారవంతంగా తయారవుతుంది. భూమి గుల్లబారడంతో పాటు ఒక లీటరు మూత్రంలో 3 నుంచి 13 గ్రాముల నత్రజని, 18 నుంచి 20 గ్రాముల పొటాషియం, పాస్ఫరస్ ఉంటాయి. గొర్రె లేదా మేక ఒక రాత్రికి లీటరు మూత్రం విసర్జిస్తుంది. ఈ ఎరువు వల్ల భూమిలో తేమశాతం నిల్వ ఉండి తడులు తక్కువగా పడతాయి. ఒక్క ఏడాది ఎరువు వస్తే మూడేళ్ల వరకు ఎరువు అవసరం ఉండదని రైతులు అంటున్నారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి



జీవాల ఎరువు పొలానికి బలాన్ని అందిస్తుంది. ఏటా జీవాల ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతోంది. దుక్కులు దున్నక ముందే జీవాల ఎరువు వేయించి కలయదున్నాలి. రైతులు పంట దిగుబడిని పెంచుకోవాలి.

–వినయ్‌కుమార్, ఏఓ, బోనకల్

భూసారం పెరుగుతుంది..



జీవాల ఎరువుతో భూసారం పెరుగుతుంది. రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల దిగుబడి ఏటా తగ్గుతోంది. రెండేళ్లుగా జీవాల ఎరువు వేయిస్తున్నాను. పంటలు మంచి దిగుబడి వస్తున్నాయి.

–ఆవుల రామకృష్ణ, రైతు, ముష్టికుంట్ల

మేతకోసం వలస వచ్చాం.



జీవాలకు మా ప్రాంతంలో వేసవికాలం మేత ఉండదు. మేత కోసం జిల్లాలు దాటి ఇక్కడికి వచ్చాం. ఇక్కడ జీవాల ఎరువుకు గిరాకీ ఉండడంతో మేతతో పాటు మాకు ఆదాయం లభిస్తోంది.

–ఎం.ఉషన్, గొర్రెల కాపరి, మహబూబ్‌నగర్ జిల్లా

ప్రకృతి ఒడిలో వేసవి సంబురం


చెట్ల మధ్య ఆడుకుంటున్న ఆదివాసీ చిన్నారులు

వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పిల్లల ఆనందానికి అవధుల్లేవు. ముఖ్యంగా వలస ఆదివాసీ పిల్లలు ప్రకృతి ఒడిలో ఎంతో సంతోషంగా గడుపుతారు. స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు, పచ్చని చెట్లు, కొండలు, కోనలు వారి ఆట స్థలాలు. పట్టణాల్లో సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితమయ్యే పిల్లలకు భిన్నంగా ఆదివాసీ పిల్లలు ప్రకృతితో మమేకమై స్వేచ్ఛగా ఆడుకుంటూ... పాడుకుంటూ తమ సెలవులను ఆనందంగా గడుపుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం కరకగూడెం మండలంలోని పద్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామంలో ఓ చెట్టుకు పాత చీరలను కట్టుకొని ఉయ్యాలా ఊగుతూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా కనిపించారు. ఆ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– కరకగూడెం

వందేళ్లకు చేరువైన తాతకు సన్మానం



కుటుంబ సభ్యులతో ఎల్లయ్య, (ఇన్‌సెట్‌లో) సానిక ఎల్లయ్య

ఇల్లెందురూరల్: వయసు రీత్యా వందేళ్లకు చేరువైన ఆ తాత నేటికీ యువకులతో పోటీ పడుతున్నట్లుగా కనిపిస్తాడు. తన పనులు తాను చేసుకుంటూ ఇంటి పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకుంటాడు. మండలంలోని 21పిట్ ఏరియాకు చెందిన సానిక ఎల్లయ్య సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రెండేళ్ల కిందట భార్య ఎల్లమ్మ మృతి చెందింది. ఈ క్రమంలో మనుమలు, మనవరాళ్లు, కుటుంబ సభ్యులు.. ఆయనతో ఒక రోజు గడపాలని నిర్ణయించారు. ఆదివారం అందరూ కలిసి వేడుక నిర్వహించారు.

రోడ్డు ప్రమాద మృతుడికి అంత్యక్రియలు

పాల్వంచరూరల్: మండలంలోని పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన రైతు సీరుడు రామారావు (53).. మూడు రోజుల కిందట తన మనుమరాలు తులసిని ద్విచక్రవాహంపై పాల్వంచకు తీసుకెళ్తుండగా బొలేరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొని మృతిచెందిన విషయం విదితమే. రామారావు చిన్న కుమారుడు అప్పారావు అమెరికా నుంచి ఆదివారం రాగా.. అంత్యక్రియలు నిర్వహించారు.

కేసు నమోదు

తిరుమలాయపాలెం: మండలంలోని ఎర్రగడ్డలో జరిగిన చోరీ నిందితుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. అందుకు కారణమని భావిస్తున్న ఓ వ్యక్తిపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రగడ్డలో ఈ నెల 3న నల్లమల్ల నీరస్‌కుమార్ ఇంట్లో జరిగిన దొంగతనం విషయంలో అదే గ్రామానికి చెందిన కొందరు అనుమానితులను పోలీసులు పిలిపించి విచారించారు. దారమళ్ల సందీప్ నేరాన్ని అంగీకరించి అతని వద్ద ఉన్న ఒక జత చెవి దిద్దులు ఇచ్చాడు. మిగిలిన బంగారపు హారం అదే గ్రామానికి చెందిన బెల్లం అభిలాష్‌కు ఇచ్చానని చెప్పాడు. దీంతో అభిలాష్.. తన పేరు ఎందుకు చెప్పావని సందీప్‌ను బెదిరించడంతో.. అతడు గడ్డిమందు తాగాడు. అతడిని తండ్రి తిరపయ్య ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా.. జిల్లా అధికారులు అక్కడికి చేరుకుని సందీప్ నుంచి వాగ్మూలం తీసుకున్నారు. తిరపయ్య ఫిర్యాదు మేరకు బెల్లం అభిలాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్ తెలిపారు.

బొలేరో ఢీకొని వ్యక్తి మృతి

మణుగూరురూరల్: బొలేరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తోగ్గూడెం సమీపంలో చోటుచేసుకుంది. తోగ్గూడెం గ్రామానికి చెందిన కొమరం ముత్తయ్య (47) రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పాల్వంచ నుంచి మణుగూరు వైపు వెళ్తున్న టీఎస్ 28 టీపీ 6954 నంబర్ గల బొలేరో వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ముత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ప్రసాద్ ఘటనా ప్రాంతానికి చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పరారీలో ఉన్న గంజాయి వ్యాపారి అరెస్టు

అశ్వారావుపేటరూరల్: గంజాయి కేసులో పరారీలో ఉన్న ఓ వ్యాపారిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఈ నెల 8న అశ్వారావుపేటలో ఏడుగురు యువకులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.2.75 లక్షల విలువైన 5.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన గంజాయి వ్యాపారి రామును ఆదివారం ఉదయం అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకొని, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దమ్మపేట: కుటుంబ సభ్యులు మందలించారనే కారణంగా పురుగులమందు తాగిన యువకుడు, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన లావుడ్యా కార్తీక్ (20) ఏపని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో అతడి తల్లి మంగ శుక్రవారం ఏదైనా పని చూసుకోమని మందలించింది. మనస్తాపం చెందిన కార్తీక్ పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని దమ్మపేట ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీ

యువకుడు మృతి..

అశ్వాపురం: మండలంలోని బీజీ కొత్తూరు స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బైక్‌పై ఓ యువకుడు మొండికుంట వైపు వస్తుండగా ధాన్యం బస్తాల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న అశ్వాపురం పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

- ఐదుగురికి గాయాలు

తిరుమలాయపాలెం : మండలంలోని పిండిప్రోలు వద్ద ఆగి ఉన్న ఆటోను లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి కాకరవాయికి ప్రయాణికులతో ఆటో వెళ్తుండగా..పిండిప్రోలు వద్ద కొందరు దిగేందుకు డ్రైవర్ రోడ్డు పక్కన ఆపాడు. ఆ సమయంలో ఖమ్మం నుంచి మరిపెడ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీ కొట్టగా ఆటో రోడ్డు కిందకు పడిపోయింది. దీంతో ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుంగా బచ్చోడు గ్రామానికి చెందిన కారుపాటి వెంకటయ్య (78) మృతిచెందాడు. ప్రయాణికులు ఎల్ల మ్మ, అమ్మి, అనసూర్య, రామపట్టాభి, కమలమ్మ చికిత్స పొందుతున్నారు. కాగా, వెంకటయ్య భార్య సోమమ్మ కూడా నాలుగేళ్ల క్రితం ట్రాక్టర్ కిందపడి మృతిచెందింది.

మహిళపై యువకుడి దాడి

తల్లాడ: తల్లాడలో ఓ మహిళపై యువకుడు మద్యం మత్తులో దాడి చేసి గాయపర్చడంతో ఆదివారం తల్లాడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు మద్యం మత్తులో కేకలు వేస్తుండగా.. ఆ సమయంలో కిరాణా దుకాణానికి వెళ్తున్న పయ్యావుల మౌనిక 'ఎందుకు అరుస్తున్నార'ని ప్రశ్నించింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న షేక్ యాకూబ్ రాయితో ఆమెపై దాడి చేయగా తల పగిలింది. ఈ మేరకు ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టోర్‌రూంలో కాపర్‌వైరు చోరీ

బోనకల్: చిరునోముల క్రాస్‌రోడ్డు సమీపంలోని రైల్వే స్టోర్‌రూంలో ఉంచిన కాపర్ వైరును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారని రైల్వే సూపర్‌వైజర్ ఆదివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మూడో రైల్వే లైన్ పనుల నిమిత్తం స్టోర్‌రూంలో కాపర్ వైరును నిల్వ చేశామని, దానిని గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. చోరీకి గురైన కాపర్‌వైరు విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని రైల్వే సూపర్‌వైజర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.వెంకన్న తెలిపారు.

గిరిజన గురుకులాల్లో సీట్లు భర్తీ


కౌన్సెలింగ్ కోసం వచ్చిన విద్యార్థినులు (ఫైల్)


కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న పీఓ (ఫైల్)

ఇల్లెందు: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల జూనియర్ బాలుర, బాలికల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన కౌన్సెలింగ్‌కు విద్యార్థులు బారులుదీరారు. 15, 16 తేదీల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 737 సీట్లు ఉండగా అన్నీ భర్తీ అయ్యాయి. బాలుర కోసం ఆర్‌జేసీ, యూఆర్‌జేసీ దమ్మపేట, ఆర్‌జేపీ, యూఆర్‌జేసీ కిన్నెరసాని డ్యామ్ సైట్, ఆర్‌జేసీ, యూఆర్‌జేసీ గుండాల, యూఆర్‌జేపీ సింగరేణి, తిరుమలాయపాలెం, ఆర్‌జేసీ కృష్ణసాగర్ జూనియర్ కళాశాలు ఉన్నాయి. ఇక బాలికల కోసం ఆర్‌జేసీ భద్రాచలం, సుదిమళ్ల, అంకంపాలెం, యూఆర్‌జేసీ భద్రాచలం, సుదిమళ్ల, మణుగూరు, కొత్తగూడెం, వైరా, అన్నపురెడ్డిపల్లి ఉన్నాయి. ఒక్క భద్రాచలం బాలికల గురుకులంలో పీఎస్‌టీటీ–20 సీట్లు, ఐఎం–20 సీట్లు, సీఎస్–20 సీట్లు, ఏటీ–20 సీట్లు, కిన్నెరసాని డ్యామ్ సైట్‌లో ఏటీ–20 సీట్లు, ఈటీ–20 సీట్లు తప్ప మిగిలిన అన్నీ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి.

పెరుగుతున్న విద్యార్థులు..

గతంలో టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణత తక్కువ ఉండటం వల్ల సీట్లు భర్తీ కావటం కష్టంగా ఉండేది. కొంతకాలంగా టెన్త్ ఉత్తీర్ణత పెరిగింది. విద్యార్థులు ఇంటర్‌లో చేరడం వస్తున్నారు. ఈ దఫా తొలి కౌన్సెలింగ్‌లోనే 12 గురుకులాలు 18 కళాశాలల్లో చేరికలు పెరిగాయి.

సీట్లన్నీ భర్తీ అయ్యాయి



ఐటీడీఏ పీఓ ఆదేశానుసారం ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన గురుకుల బాలుర బాలికల జూనియర్ కళాశాలల ప్రవేశానికి పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్‌లో సీట్లు భర్తీ చేశాం. అన్ని కళాశాలల్లో ఉన్న 737 సీట్లు భర్తీ అయ్యాయి.

–బి.అరుణకుమారి, ఆర్‌సీఓ, భద్రాచలం

ఆదివాసీ సమాజంపై రాజకీయ కుట్రలు

తుడుందెబ్బ నేత మైపతి అరుణ్‌కుమార్


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఇల్లెందు: రాజకీయ కుట్రలకు ఆదివాసీ సమాజం బలవుతోందని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు మైపతి అరుణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాగర్జన సభలో మాట్లాడారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చి కాంగ్రెస్ పార్టీ ఆదివాసీల గొంతు కోసిందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు కూడా లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పడంలేదన్నారు. రాజకీయ పార్టీల కుట్రలను ఛేదించేందుకు ఆదివాసీలు అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, పొదెం వీరయ్య, తాటి వెంకటేశ్వర్లు వంటివారు ఒక్కసారి కూడా శాసనసభలో ప్రశ్నించలేదని ఆరోపించారు. ఆధార్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు జేజే రాంబాబు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టును ఆశ్రయించామని, కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. అంతకుముందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో కొమరం భీం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలో ఆదివాసీ వేషధారణలతో కళా ప్రదర్శన నిర్వహించారు. సభలో కళాకారులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్, నాయకులు కల్తీ సత్యనారాయణ, మెట్ల పాపయ్య, తెల్లం వెంకటేశ్వర్లు, జనార్దన్, పోలెబోయిన వెంకటేశ్వర్లు, చుంచు రామకృష్ణ, పొడియం బాలరాజు, బుగ్గ రామనాథం, జోగ రాంబ్రహ్మం పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో ఆదివారం జరిగిన ప్రపంచ ప్రదర్శనశాల దినోత్సవం, కోయ వీరగాథ చక్రం ప్రదర్శన డాక్యుమెంటేషన్ ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గూడేలలో గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలను మొక్కవోని ధైర్యంతో ఎదిరించిన సమ్మక్క సారలమ్మలు, కాకతీయులను ఎదిరించి వీరమరణం పొందిన ఆదివాసుల ఇలవేల్పులు బాపనమ్మ చంద్రపాల వారసులు, రుద్రమదేవి పరిపాలన కాలంలో వాడిన ఆయుధాలు, వారి చరిత్రను వీరగాథలుగా మలిచి నేటితరం గిరిజనులకు తెలియపరచడం అభినందనీయమన్నారు. ఆదివాసీ కళలు, ఆచార వ్యవహారాలు అంతరించిపోకుండా, ఖండాంతరాలకు తెలిసే విధంగా గిరిజన మ్యూజియంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. కార్యక్రమంలో తిరుమల్‌రావు, బండ్ల మునీశ్వరరావు, గొర్రె బాపనయ్య, బండ్ల చుక్కమ్మ, గొర్రె సత్యం, రాంబాబు పాల్గొన్నారు.

కొట్టుకున్నాయి.. ఇరుక్కున్నాయి..


పోట్లాడుకుంటున్న గేదెలు

కొమ్ములు తిరిగిన రెండు గేదెలు పోట్లాడుకున్నాయి. నువ్వెంత అంటే నువ్వెంత అన్నట్లు ఘర్షణ పడ్డాయి. ఈ క్రమంలో వాటి కొమ్ములు ఒకదానిలో ఒకటి ఇరుక్కుని నరకయాతన అనుభవించాయి. ఈ ఘటన ఆదివారం పాలేరులో చోటుచేసుకుంది. గేదెల కొమ్ములు ఇరుక్కొని ఎంతకీ రాకపోవటంతో స్థానికులు అతి కష్టంపై వాటిని తొలగించగా అవి ఊపిరిపీల్చుకున్నాయి.

– కూసుమంచి